# భేదాల వల్ల ఖేదము

కందుకూరి వెంకటమహాలక్ష్మి

అది రష్యా రాజధాని మాస్కో పట్టణం. అక్కడ అదిపెద్ద స్టార్ హటల్ "గస్తినిస్యారష్యా".

ఆరోజు భారతదేశం నుంచి వచ్చిన పాల డైరీ విభాగం డెలిగేషన్‌కి అందులో పార్టీ ఇస్తున్నారు అక్కడి ఆ డిపార్టుమెంటు రష్యన్‌లు.

వారిలో అనేక ప్రాంతాల భారతీయులున్నారు. ఆ డెలిగేషన్‌లో కొందరు ఢిల్లీవారు మాకు పరిచయస్తులు వుండటంతో మాకూ ఆహ్వానం లభించి వెళ్ళాం. పార్టీకి వచ్చిన భారతీయులకి మమ్మల్ని మేము పరిచయం చేసుకున్నాం.

పార్టీ ప్రారంభమయింది. తినేవాళ్ళు తింటూ, డ్రింకులు తాగేవాళ్ళు తాగుతూ, డాన్సులు చేసేవాళ్ళు చేస్తూ ఎవరి హుషారులో వాళ్ళున్నారు.


ఆ పార్టీకొచ్చిన రష్యన్ స్త్రీలు, పురుషులూ వచ్చిన డెలిగేట్సుని ఆహ్వానిస్తూ, వారితో కలిసి డాన్సులు చేస్తున్నారు. పార్టీ అయ్యేసరికి రాత్రి పన్నెండు దాటింది. పార్టీ ముగిసాకే ఎవరిళ్ళ దారి వాళ్ళు పట్టేరు. మాకు పరిచయమయిన వారివద్ద శలవు తీసుకుని, ఆ మర్నాడు మా యింటికి వారిని ఆహ్వానించి వచ్చాము.

మర్నాడు రష్యాలో దొరికే వస్తువులతో ఆ భారతీయులకి భోజనాల ఏర్పాటు చేసాం. మర్నాడు సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో వారిలో కొందరు మా యింటికి డిన్నర్‌కి వచ్చారు.

కాస్సేపు కబుర్లయ్యాక భోజనాలకి కూర్చున్నాం. ఆ డెలిగేషన్ రష్యాలో కొన్ని ప్రాంతాలు తిరిగి రావడంతో అక్కడి తిండికి నోరు చచ్చి వున్న వాళ్ళకి మా భారతీయ భోజనం, కాస్త ఉప్పు కారం తగలడంతో ఎంతో ఆనందాన్ని కలిగించింది.

పులిహోర, సాంబారు వంటివి ఎంతో ఆప్యాయంగా తిన్నారు.

రష్యాలో అక్టోబర్ నుంచి మే నెల వరకూ ఒక్క బంగాళాదుంప, ఉల్లిపాయలు తప్ప ఏ కూరలూ దొరకవు. జూన్ నెల నుంచి సెప్టెంబర్ వరకూ టమాటాలూ, వంకాయలూ, కాలీఫ్లవరూ, క్యాబేజీ, గుమ్మడికాయ, ఆనపకాయలాంటివి అప్పుడప్పుడూ మార్కెట్‌లో కనపడతాయి. అప్పుడు ఆ షాపుల్లో పెద్ద క్యూ వుంటుంది. ఎంత క్యూ వున్నా లైన్లో నిలబడి ఎక్కువెక్కువ కొనేసుకుని ఫ్రిజ్‌లో దాచుకుంటారక్కడి భారతీయులు. ఈ కూరలు కూడా మాస్కోలో





పండవు. అక్టోబరు పదవతేదీ తరువాత నుండి మంచు పడటం ప్రారంభించి డిశంబరు, జనవరి నాటికి మైనస్ ముప్పైకి కిందకి దిగిపోయే టెంపరేచర్‌లో ఏ పంటలూ వుండవు. ఇతర జిల్లాల నుంచి వచ్చే కూరలే అక్టోబర్ తరువాత దొరికేవి. దొరికినప్పుడు ఎక్కువగా కొని దాచుకుని అపురూపంగా తినేవాళ్ళం.

అలాంటిది ఈ డెలిగేట్స్ జులై నెలలో రావడం వాళ్ళకి కాస్త భారతీయ భోజనం వండి పెట్టగలగడం మాకూ, తినగలగడం వాళ్ళకీ అదృష్టమనే చెప్పాలి.

సంతృప్తిగా భోంచేసిన డెలిగేట్సూ, మేమూ కాస్సేపు కబుర్లయ్యాక వెళ్లడానికి లేచాం.

అందులో శంకరన్ అనే చెన్నై అతను మమ్మల్ని పక్కకి పిల్చి జేబులోంచి ఓ చీటీ తీసాడు. అందులో ఓ అడ్రసు రష్యన్‌లో రాసి వుంది. అది ఇంగ్లీషులోకి తర్జుమా చేసి పెట్టమనగానే చేసాం. అది జేబులో పెట్టుకుని శంకరన్ చెప్పిందేమిటంటే 'ఈ అడ్రస్ అమ్మాయి నిన్న నాతో హోటల్లో డాన్సు చేసిందనీ వచ్చేసేటప్పుడు కౌగిలించుకుని ముద్దిచ్చిందనీ, తరువాత అడిగితే ఈ అడ్రసు, టెలిఫోన్ నెంబరు రాసి యిచ్చిందనీ ఎంతో ఆనందంతో మురిసిపోతూ చెప్పాడు. శంకరన్ మాటలు మాకు ఆశ్చర్యం కలుగచేసాయి. అతనికి సుమారు యాభైఏళ్ళ దాకా వుండొచ్చు. పెళ్లయి పిల్లలు కూడా వుండి వుండొచ్చు. అలాంటివాడు యిక్కడికి డెలిగేషన్‌లో వచ్చి ఓ గంట తనతో డాన్సు చేసిన ఓ అమ్మాయి మోహంలో పడి వెంటపడటం, ఎంతవరకూ సమంజసం ! అనిపించింది. ఇక్కడి రివాజు ప్రకారం ఎవరొచ్చినా పార్టీల్లో డాన్సులు చెయ్యడం, పాటలు పాడడం సహజం, సర్వసాధారణం. ఈ శంకరన్ ఆ రష్యన్ అమ్మాయి తనొక్కడితోటే డాన్సు చేసినట్లు, ఆ అమ్మాయి వ్యామోహంలో పడటం ఆశ్చర్యం కలిగించింది. "ఆ అమ్మాయంటే తనకెంతో ప్రేమ కలిగిందనీ, ఆమెకి ఉత్తరాలు రాస్తూ వుంటాననీ" ఇలా తన ప్రేమనంతా ఒలకబోసుకుంటూ, ఆమెతో డాన్సు చేసిన మధుర క్షణాలని గురించి తన్మయత్వంతో చెప్పుకుపోసాగాడు. మాకు అతని అమాయకత్వానికి జాలేసింది. అంతకీ వుండబట్టలేక మన భారతదేశానికీ ఈ దేశానికీ అదే తేడా, (ఆ రోజుల్లో) మనదేశం స్త్రీలు అంతగా పరాయి మగవారితో యిలా పార్టీల్లో డాన్సులు చెయ్యడం తక్కువనీ, ఇక్కడి వారికి పార్టీ అంటేనే తిండితో పాటు డ్రింకులూ, డాన్సులూ, పాటలూ సహజం అనీ చెప్పబోయాం. దానికతను నో- నో- ఆ అమ్మాయి నన్ను అంతలా హత్తుకుపోయి, ముద్దిచ్చిందంటే మీరన్న రకం కాదు" అన్నాడు. సరే మనకెందుకు అనుకుని వారిని సాగనంపేము.

కొన్ని నెలలు గడిచాయి. మాకు శంకరన్ నుంచి ఓ కవరు వచ్చింది. అందులో తను "ఆ హోటల్‌లో డాన్సు చేసిన తానియాకు ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబు రావటం లేదనీ, ఫోన్ చేసినా వేరే ఎవరో ఎత్తుతున్నారనీ, తనకి రష్యన్ రాదనీ, వాళ్ళకి ఇంగ్లీషు రాదనీ, ఏం చెయ్యాలో అర్థం కావటంలేదనీ, దయచేసి మీరు ఈ టెలిఫోన్ నెంబరుకి ఫోను చేసి, నా గురించీ, నా బాధ గురించీ ఆమెకి తెలియజెయ్యమనీ బ్రతిమాలుతూ రాసాడు. ఆ ఉత్తరం చదివి మేము షాకయ్యాం. నిజంగా ఆ దేశ పద్ధతులు తెలిసిన మేము ఆమెకి ఫోన్ చేస్తే ఏమంటుంది? ఆ




అమ్మాయికి పెళ్ళయి వుండవచ్చు. వాళ్ళకి పెళ్ళయినా పరాయి మగవారితో డాన్సు చెయ్యడం తప్పు కాదు. అలాంటి ఆమెకి ఫోన్ చేసి కొన్ని నెలల క్రితం జరిగిన విషయం చెప్తే ఆమె కసలు గుర్తుంటుందా? గుర్తున్నా అతని ప్రేమ వేదన గురించి చెప్తే ఎలా చలిస్తుంది?" లాంటి ఆలోచనలు మాలో కలిగి ఆ ఉత్తరాన్ని పక్కకి పెట్టాం. ఆ ఒక్క ఉత్తరంతో ఆగక నెలకో ఉత్తరం చొప్పున ఆరేడు ఉత్తరాలు రాసి, చివరికి నిష్ఠూరాలతో ఈ మాత్రం ఉపకారం చెయ్యలేరా?" అంటూ గట్టిగా ఓ ఉత్తరం రాసాడు. అదీగాక ఓ రోజు ఫోన్ చేసి తన వేదనని తానియాకి చెప్పమని బ్రతిమాలసాగాడు. మేము మళ్ళీ అవే విషయాలని చెప్పాలని ప్రయత్నిం చాం. ఒక్కసారి ఫోన్ చేసి ప్రయత్నించమని బ్రతిమాలి ఫోన్ పెట్టేసాడు.

సరేనని ఓరోజు తానియాకి ఫోన్ చేసి శంకరన్ గురించి చెప్పడానికి ప్రయత్నించాం. తను అన్నీ విని నవ్వేసి స్పసీబా, దస్విదానియా" (థేంక్యూ, బైబై) అని చెప్పండి' అని పెట్టేసింది. మళ్ళీ ఫోన్ చేసిన శంకరన్‌కి తానియా చెప్పిన మాటలు చెప్పగానే చిన్నబుచ్చుకున్నా డనుకుంటా "మీరు సరిగ్గా చెప్పి వుండరు" అని ఫోన్ పెట్టేసాడు. ఆ తరువాత అతని దగ్గరనుంచి ఫోన్ గానీ, ఉత్తరం గానీ లేదు.

ఇది జరిగి ఏడాది దాటింది. ఓరోజు శంకరన్ దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు?" అని అడగ్గానే "తను మళ్ళీ డెలిగేషన్‌తో మాస్కోకి వచ్చాననీ, సాయంకాలం మా యింటికి వస్తా"ననీ ఫోన్ చేశాడు. అన్న ప్రకారం సాయంకాలం ఏడింటికల్లా మా యింటికొచ్చాడు. చేతినిండా కొన్ని యిండియన్ ప్రెజెంటేషన్లువున్నాయి. కాస్సేపు కూర్చున్న తరువాత "ఓసారి తానియా యింటికి వెళ్దాం వస్తారా?" అని అడిగాడు. మాకు మతిపోయింది. ఎందుకంటే సాధారణంగా ఆఫీసు ల్లోను, అలాంటి పార్టీల్లోనూ కలుసుకుని ఎన్ని కబుర్లన్నా చెప్పుకోవచ్చుగానీ వాళ్ళు మనిళ్ళకి రావడం, మనం వెళ్తే భారత దేశంలో లాగా ఆహ్వా నించి కబుర్లు చెప్పడం లాంటివి చెయ్యరు. మనం వెళ్ళినా భయం భయంగా చూస్తారు. అది ఆ దేశీయుల పద్ధతి. అన్నేళ్ళయి మేము మాస్కోలో వున్నా అక్కడున్న భారతీయుల యిళ్ళకి వెళ్ళడం తప్ప ఏ రష్యన్‌ల యిళ్ళకీ కబుర్లు చెప్పుకోడానికి వెళ్ళలేదు.

అలాంటిది శంకరన్ ఒక్కసారే పరిచయం అయిన తానియా ఇంటికెళ్దా మనగానే ఏమనాలో తోచలేదు. ఒక్కసారి పార్టీలో తనతో డాన్సు చేసిన తానియాని అంతగా అతను తల్చుకుంటూ ఇన్నేళ్ళుగా మరవక పోవడం ఆశ్చర్యంగానూ, వింతగానూ వుంది. ఆ విషయం అతనికి అర్థమయ్యేలా చెప్పాలని ప్రయత్నిం చాం. కానీ అతను ఆ అడ్రసు పట్టుకుని "ఒక్కసారి వెళ్ళి ఈ ప్రెజెంటేషన్లు యిచ్చేసి వద్దాం !" అన్నాడు. "ఇప్పుడొద్దు చీకటి పడుతోంది బాగుండదు. రేపు వెళ్దాం" అన్నాం. దాంతో ఏమనుకున్నాడో "రేపు మాకు పార్టీ వుంది. అక్కడికి తానియా వస్తే కలుస్తాం అందుకు ఎల్లుండి వస్తాను వెళ్దాం. అక్కడ కలిసినా ఈ కానుకలిస్తే బాగుండదు కదా ! కానీ ఒక్కసారి ఫోన్‌లో మాట్లాడదాం. ఫోన్ చేసి నేను వచ్చినట్లు చెప్పండి అన్నాడు. ఇదెక్కడి గొడవరా బాబూ. ఆ తానియాకి శంకరన్ గుర్తుంటాడా?" అనుకుంటూ ఆ తానియాకి ఫోన్ చేసాం. తానియా యింట్లో లేదనీ, బైటికెళ్ళిందనీ జవాబు రావడంతో నీరసపడి పోయాడు. శంకరన్ కూర్చున్నంతసేపూ తానియా కబుర్లే చెప్తూ ఆనందపడ్డాడు.

మళ్ళీ అతనన్నట్లుగానే మూడోరోజు మా ఇంటికొచ్చాడు. చాలా సీరియస్‌గా వున్నాడు. తానియా గురించి చాలా చిరాగ్గా మాట్లాడసాగాడు. నిన్న పార్టీకి వచ్చిందనీ, తను పలకరించినా కొత్తవాళ్ళతో మాట్లాడినట్లు మాట్లాడిందనీ, అక్కడే మరో మగాడితో డాన్సుచేసి, ముద్దులెట్టుకుంటుందనీ ఈ ఆడాళ్లకి సెంటిమెంట్లు వుండవనీ, మనలా ప్రేమలూ, అభిమానాలూ వుండవనీ అనవసరంగా యిన్నేళ్ళూ ఆ తానియాని తల్చుకుంటూ బాధపడ్డాననీ చిరాకు పడుతూ చెప్పి, తెచ్చిన ప్రెజెంటేషన్‌లను "దాని కివ్వను" అంటూ తానియాకివ్వాలని మా యింట్లో పెట్టి వెళ్ళిన ప్రెజెంటేషన్‌లన్నీ తీసుకుని వెళ్ళి పోతూంటే మాకు నవ్వాగలేదు. దేశాలమధ్య పద్ధతుల తేడాలని చెప్పినా అర్థం చేసుకోని శంకరన్‌ని చూస్తే జాలేసింది మాకు.

## వడ్రంగిపిట్ట

తొలుస్తున్నావు కదా
జ్ఞాపకాల బెరడును
గతాల నుసి రాల్చుతూ
పచ్చని జీవితకాండను
ఆవిష్కరిస్తున్నావు
పాలుకారే చెక్కిళ్ళపై
ముద్దుమురిపాలు గుది గుచ్చుతూ
పగడాల కంటితో
చంచల నునుచూపుల
నక్షత్ర కిరణాలు గుప్పుతూ
తొంగిచూస్తున్నావు కదా
నిర్మలాకాశపు నేపథ్యాన
కొబ్బరాకుల నీడన
నిండు జాబిలివై
తియ్యటి నెనపుల తేల్చుతూ -
మా అమ్మ ఎదపై
నిను నేను చూస్తుంటే
మా నాన్నవే నీవు
చిన్ని నవ్వుల తల్లి
మీ అమ్మచేతి పట్టి
బుడీ బుడీ నడుస్తూంటే
తొలిప్రేమ స్పర్శలో
ఝుళ్ళుమన్న నా మదిలా
ఘుళ్ళు మంటున్నది నీ పాదాల సవ్వడి
నేనేరి కూర్చుకునే ముత్యాలమాటలూ
నే పేర్చి పెట్టుకునే అక్షరాల పేటలూ
నీ కేరింతలు తుళ్ళింతలు
నా యవ్వనోద్వేగాల
వురుకులూ పరుగులూ
మీ అమ్మ వొడిలోకి
వాలే
వడ్రంగిపిట్టలు.

\- జి. వెంకటకృష్ణ